ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్‌యువ వికాసం పథకాలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే ఇస్తామని మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ మాట్లాడిన వీడియోను చూపిస్తున్న వేముల

50 వేలిస్తే ఇందిరమ్మ ఇల్లిస్తరా?

- లబ్ధిదారులను కాంగ్రెస్ నేతలే ఎంపిక చేస్తరా?
- ఇప్పటివరకు ఒక్క ఇల్లు కట్టని సర్కార్
- ప్రభుత్వ సొమ్మును కాంగ్రెస్ కార్యకర్తలకు పంచితే ఊరుకోం
- తహసీల్, పంచాయతీ కార్యాలయాలను ముట్టడిస్తాం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల

ఖలీల్‌వాడి, మే 11: రూ.50 వేలు తీసుకొని ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. లబ్ధిదారులను కాంగ్రెస్ పార్టీ నేతలు తమ ఇండ్లల్లో కూర్చొని ఎంపిక చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామసభల ద్వారానే ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు ఇస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తే, ప్రజలు నమ్మి ఓటు వేశారని తెలిపారు. అధికారంలోకి వచ్చి 17 నెలలవుతున్నా దసరా, సంక్రాంతి అంటూ మాటలు చెప్తూ వాయిదా వేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటివరకు ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించారు. నిజామాబాద్ జిల్లాలో 1.8 లక్షల మంది పేదలు ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకోగా.. కాంగ్రెస్ నేతలు ఇండ్లల్లో కూర్చొని 70 వేల మందిని ఎంపిక చేశారని తెలిపారు. 70 వేల మంది అర్హులని చెప్పిన కాంగ్రెస్ నేతలే, ఇప్పుడు కేవలం 17 వేల మందికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వమే ఇచ్చిన జీవో 7 ప్రకారం గ్రామ సభల ద్వారా అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు ఎంపిక చేస్తే పేదలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

జేబులు నింపుకోవడానికి యువ వికాసం

కాంగ్రెస్ నేతల జేబులు నింపుకోవడానికి రాజీవ్ యువవికాసం పథకం ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే వేముల విమర్శించారు. డబ్బులు ఇచ్చిన వారికి, కాంగ్రెస్ కార్యకర్తలకే ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారని ఆరోపించారు. పథకం ద్వారా రూ. 6,500 కోట్లు నేరుగా కాంగ్రెస్ నేతల జేబులు నింపేందుకు పక్కాప్లాన్ వేశారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు మాత్రమే రాజీవ్ యువ వికాసం పథకం, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్ బహిరంగంగా చెప్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడిన వీడియోను వేముల మీడియా ముందు ప్రదర్శించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మందకొడిగా సాగుతున్నదని తెలిపారు. తరుగు పేరిట రైస్‌మిల్లర్లు రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. అందాల పోటీలపై పదిసార్లు సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ధాన్యం కొనుగోళ్లపైనా సమీక్షించాలని సూచించారు.

మహేశ్.. నిన్ను కాపాడుతా!

- 4 రోజుల్లో మండెపల్లికి తీసుకొస్తా
- సొంత ఖర్చులతో వైద్యం చేయిస్తా
- సౌదీ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు మహేశ్‌కు వీడియో కాల్ ద్వారా కేటీఆర్ భరోసా
- కుటుంబసభ్యులకు పరామర్శ

సౌదీ దవాఖానలో చికిత్స పొందుతున్న మహేశ్‌తో వీడియో కాల్ మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కుటుంబ సభ్యులు

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ)/సిరిసిల్ల రూరల్: 'మహేశ్.. నాలుగు రోజులు ధైర్యంగా ఉండు. సౌదీలో ఉన్న మనోళ్లు నీ దగ్గరకు వస్తరు. నిన్ను నాలుగు రోజుల్లోనే మండెపల్లికి తీసుకు వస్తా' అని సౌదీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతున్న మహేశ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు భరోసానిచ్చారు. పొట్ట చేత పట్టుకొని జీవనోపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లిన మండేపల్లి గ్రామానికి చెందిన మహేశ్, అక్కడ ఒక కంపెనీ బస్సులో పనికి వెళ్తుండగా.. రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోగా.. మహేశ్ మాత్రం బతికాడు. కానీ, తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రస్తుతం సౌదీలోని జుబెయిల్ జనరల్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. డబ్బులు లేక సరైన వైద్యం అందక, మహేశ్ పరిస్థితి విషమంగా మారుతున్నది. ఈ విషయం తెలుసుకున్న కేటీఆర్.. మండేపల్లిలోని మహేశ్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. మహేశ్ చికిత్సకు అవసరమైన వైద్య ఖర్చులు, విమాన ప్రయాణ ఖర్చులు మొత్తం తానే భరిస్తానని, ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వారి సమక్షంలోనే సౌదీ దవాఖానలో ఉన్న మహేశ్‌తో వీడియో కాల్ చేసి మాట్లాడారు. 'మహేశ్ నాలుగు రోజులు ధైర్యంగా ఉండు. సౌదీలో ఉన్న మన టీం సభ్యులు వచ్చి నిన్ను కలుస్తరు. మాట్లాడుతరు. అధైర్యపడకు. నేనున్నా. అన్నీ చూసుకుంటా. నిన్ను మండెపల్లికి తీసుకువస్తా' అంటూ ధైర్యం చెప్పారు. సౌదీ దవాఖానలో డిశ్చార్జి చేయించి, సొంత ఖర్చులతో మండెపల్లికి తీసుకువస్తానని మహేశ్‌కు వివరించారు. రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడం, మహేశ్ ప్రాణాలతో బతకడం అదృష్టమని పేర్కొన్నారు. సౌదీలో ఉన్న పార్టీ ప్రతినిధులు, పరిచయాలు ఉన్న వారిని వెంటనే మహేశ్ వద్దకు పంపించిన కేటీఆర్.. ఆయనకు అండగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. మహేశ్ స్వస్థలానికి వచ్చే ప్రక్రియలో అవసరమైన అధికారిక కార్యక్రమాల సమన్వయం కోసం తెలంగాణ ఎన్నారై శాఖ, విదేశాంగ శాఖ అధికారులకు లేఖ రాశారు. కేటీఆర్ ఆయన వెంట డాక్టర్ నక్క రవి, రాగిపెల్లి కిష్టారెడ్డి, బండి భాస్కర్, పెద్ది వెంకటేశ్, నేవూరి రాం, ప్రశాంత్, పర్శరాములు, నేవూరి నవీన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మీ వల్లే మా బాబు దక్కిండు సార్

- చికిత్సకు మీ సాయం మరువలేను
- అల్మాస్‌పూర్‌లో కేటీఆర్‌కు ముక్క బాల్‌రాజు కృతజ్ఞతలు

ఎల్లారెడ్డిపేట, మే 11: 'సార్. మీ వల్లే మా బాబు మాకు దక్కిండు. గుండె చికిత్సకు మీరందించిన సాయం మరువలేను' అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లికి చెందిన ముక్క బాల్‌రాజు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. బాల్‌రాజు-కల్పన దంపతులకు ఐదు నెలల క్రితం బాబు(భరత్‌కుమార్) జన్మించాడు. అతనికి పుట్టుకతోనే గుండెకు రంధ్రం ఉన్నదని, మందులతో తగ్గుతుందని వైద్యులు చెప్పారు. కానీ, మూడు నెలలైనా తగ్గకపోగా, సమస్య పెద్దదై, శ్వాస ఇబ్బంది ఏర్పడింది. దీంతో బాబును మార్చి 7న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఆపరేషన్‌కు రూ.8 లక్షలు అవుతుందని వైద్యులు చెప్పడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో బాలుడి తల్లికి బంధువైన అల్మాస్‌పూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులకు తమ పరిస్థితిని తెలియజేయగా, వెంటనే వారు కేటీఆర్‌కు సమాచారం ఇచ్చారు. కేటీఆర్ వెంటనే స్పందించి బాలుడి ఆపరేషన్‌కు సాయం అందించే ఏర్పాటు చేశారు. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తికావడంతో కుటుంబ సభ్యులు ఇటీవలే అక్కపల్లికి చేరుకున్నారు. కేటీఆర్ ఆదివారం అల్మాస్‌పూర్ రేణుకాదేవి ఆలయానికి వస్తున్నట్టు సమాచారం తెలియడంతో బాల్‌రాజు వచ్చి ఆయనను కలిశారు. 'మీ వల్లే మా బాబు దక్కిండు సార్. మిమ్మల్ని ఎప్పటికీ మరిచిపోలేమంటూ' కృతజ్ఞతలు తెలియజేశారు.

అంజక్కా.. బాగున్నవా!

- ఆరోగ్యమెట్లా ఉన్నది
- ఉద్యమ నాయకురాలికి కేటీఆర్ ఆత్మీయ పలకరింపు

వీర్నపల్లి, మే 11: 'అంజక్కా.. బాగున్నవా.. ఆరోగ్యం ఎట్లుంది?' అంటూ తెలంగాణ ఉద్యమకారిణి అల్వాల అంజమ్మను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆత్మీయంగా పలకరించారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం శాంతినగర్‌లో బీఆర్ఎస్ నేత జుంకీలాల్ కొడుకు సాగర్-ప్రవళిక వివాహ వేడుకకు కేటీఆర్ హాజరయ్యారు. కొంతకాలంగా అనారోగ్యానికి గురైన అంజమ్మ కేటీఆర్‌ను చూడగానే ఆలింగనం చేసుకొని భావోద్వేగానికి లోనైంది. 'నువ్వు.. నా బంగారానివి బిడ్డ. నిన్ను చూడక ఎన్ని రోజులవుతున్నది' అంటూ కన్నీరు పెట్టుకున్నది. 'బాపు పానం బాగున్నదా.. అమ్మ, పిల్లలు ఎట్లున్నరు?' అంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గురించి ఆప్యాయంగా ఆరా తీసింది. గతంలో తన పాణం బాగా లేకుంటే బాపు పైసలు పంపించిండు అంటూ కేసీఆర్ చేసిన సహాయాన్ని గుర్తుచేసుకున్నది.

సఫారీ యాత్రికులకు కనిపించిన పెద్దపులి

అచ్చంపేట, మే 11 : నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అడవిలోని అమ్రాబాద్ టైగర్‌రిజర్వు ఫారెస్టులో పులుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. ఆదివారం ఉదయం సఫారీకి వెళ్లిన యాత్రికులకు ఫరహాబాద్ వ్యూపాయింట్ ప్రాంతంలో ఓ పెద్దపులి కనిపించింది. కొద్దిసేపు రోడ్డుకు అడ్డంగా నిలబడి అక్కడినుంచి అడవిలోకి వెళ్లిపోయింది. యాత్రికులు పెద్దపులి కదిలికలు సెల్‌ఫోన్‌లో బంధించారు.

నల్లమలలోని ఫరహాబాద్ దారిలో కనిపించిన పెద్దపులి

సతీశ్‌రెడ్డికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

హైదరాబాద్, మే 11(నమస్తే తెలంగాణ): నేషనల్ టెక్నాలజీ డేను పురస్కరించుకుని ఆదివారం అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్(ఏఎస్‌టీసీ) ఆధ్వర్యంలో ఐఐసీటీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జీ సతీశ్‌రెడ్డికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేశారు. 1986లో డీఆర్‌డీఎల్‌లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన సతీశ్‌రెడ్డి.. ఆర్‌సీఐ డైరెక్టర్‌గా, రక్షణ పరిశోధన, అభివృద్ధి శాఖ కార్యదర్శిగా, డీఆర్‌డీవో చైర్మన్‌గా విధులు నిర్వర్తించారు. పలు క్షిపణి వ్యవస్థల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారు.

మరో ఐదురోజులు వర్షాలు

- ఆరెంజ్ అలర్ట్ జారీ, అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరిక

హైదరాబాద్, మే11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తుండగా ఐదురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశముందని వెల్లడించింది. ఈ నెల 13,14న ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, మేడ్చల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ-గద్వాల.. జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, గంటకు 50 నుంచి 60 కి.మీ వేగంతోఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ జారీచేసింది. రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 38.2డిగ్రీలు, కనిష్టంగా 23.1డిగ్రీలు నమోదవుతాయని తెలిపింది.

ధాన్యాన్ని ఎందుకు తరలించరు?

- మహబూబాబాద్ జిల్లా గంట్లకుంట రైతుల ఆగ్రహం
- రోడ్డుపై వెళ్లే లారీకి అడ్డంగా పడుకొని రైతుల నిరసన

పెద్దవంగర, మే 11: కొనుగోలు కేంద్రంలో కాంటాలైనా ధాన్యాన్ని మిల్లుకు తరలించకపోవడాన్ని నిరసిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం గంట్లకుంట పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కొడకండ్ల-అవుతాపురం రహదారిపై లారీకి అడ్డంగా పడుకొని నిరసన చేపట్టారు. తమ సెంటర్‌కు లారీని తరలించాలని రైతులు డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రంలో చాలా బస్తాలు కాంటాలై ఉన్నా.. మిల్లులకు తరలింపులో రోజుల తరబడి జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. సెంటర్ ఇన్‌చార్జితో రైతులు వాగ్వాదానికి దిగడంతో లారీని పంపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అకాల వర్షాలకు ధాన్యం తడుస్తుందని.. కాంటాలైన బస్తాలు సైతం తడవడంతోపాటు చెదలు పడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కొనుగోలు కేంద్రంలో కాంటాలు కావాలన్నా.. మిల్లుకు తరలించాలన్నా.. సెంటర్ ఇన్‌చార్జీకి కొంత డబ్బు ముట్టజెప్పాల్సి వస్తుందని రైతులు ఆరోపించారు. దొడ్డు ధాన్యాన్ని మాత్రమే మిల్లు యాజమాన్యాలు, లారీ గుత్తేదారులు తీసుకెళ్తున్నారని, సన్నధాన్యాన్ని తీసుకెళ్లడంలో జాప్యం చేస్తున్నారని తెలిపారు.

మహబూబాబాద్ జిల్లా గంట్లకుంట కొనుగోలు కేంద్రం వద్ద రోడ్డుపై లారీ ముందు పడుకొని నిరసన తెలుపుతున్న రైతులు

'ఎరువుల' గుట్టు ఎవరికెరుక...?

మార్క్‌ఫెడ్ ఎరువుల టెండర్లలో గూడుపుఠాణి

తొలుత ఏడాది కాలానికే టెండర్ నోటిఫికేషన్

- తర్వాత రెండేండ్లకు మార్చుతూ మళ్లీ నోటిఫికేషన్
- గత పదేండ్లుగా ఏడాది కాలానికే టెండర్లు
- ఇప్పుడు రెండేండ్లకు మార్చడంపై అనుమానాలు
- అర్హత నిబంధనల్లోనూ గందరగోళం
- ఒక్కోచోట ఒక్కోలా పేర్కొన్న అధికారులు
- ఈఎండీ డిపాజిట్‌కు ఎస్‌బీఐని కాదని ప్రైవేట్ బ్యాంక్‌కు కట్టబెట్టిన వైనం

హైదరాబాద్, మే 11(నమస్తే తెలంగాణ): మార్క్‌ఫెడ్‌లో ఎరువుల రవాణా, హ్యాండ్లింగ్, స్టోరేజీకి సంబంధించిన టెండర్ల నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు ఇష్టారీతిగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, మంత్రితోపాటు ఉన్నతాధికారులకు తప్పుడు సమాచారం ఇస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నోటిఫికేషన్ నుంచి మొదలుకొని చివరి వరకు ప్రతిచోటా ఏదో గూడుపుఠాణి నడుస్తున్నదనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ వ్యవహారంలో మార్క్‌ఫెడ్‌లోని ఓ అధికారి అంతా తానై వ్యవహరిస్తున్నారనే చర్చ జరుగుతున్నది. ఎరువుల టెండర్లలో ఏదో గూడుపుఠాణి జరిగిందనడానికి పేపర్ నోటిఫికేషన్ ఇచ్చిన తీరుపైనే మొదటి అనుమానం వ్యక్తమవుతున్నది. గడిచిన పదేండ్లుగా ఎరువుల ట్రాన్స్‌పోర్ట్, హ్యాండ్లింగ్‌కు సంబంధించి ఏడాది కాలానికి మాత్రమే టెండర్లు పిలుస్తున్నారు. కానీ, ఈసారి మాత్రం రెండేండ్ల కాలానికి టెండర్లు పిలవడం అనుమానాలకు తావిస్తున్నది. ఎరువుల ట్రాన్స్‌పోర్ట్, హ్యాండ్లింగ్‌కు సంబంధించి తొలుత ఏప్రిల్ 5న ఒక పత్రికలో ఇచ్చిన నోటిఫికేషన్‌లో కేవలం ఒకే సంవత్సరానికి (2025-26) టెండర్లు పిలుస్తున్నట్టు పేర్కొన్నారు. మళ్లీ ఏప్రిల్ 9న సవరణ నోటిఫికేషన్ జారీచేసిన మార్క్‌ఫెడ్ 2025-26, 2026-27 రెండేండ్ల కాలానికి టెండర్లు పిలుస్తున్నట్టు పేర్కొన్నది. దీని వెనుక ఏం జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రెండేండ్ల కాలానికి టెండర్ పిలవాల్సిన అవసరం ఏంటనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి.

సవరణ ప్రకటనపై కాలయాపన... ఎందుకీ రహస్యం?

ప్రీబిడ్ సమావేశంలో నిబంధనల మార్పులపై తీసుకున్న నిర్ణయాలను వెల్లడించడంలోనూ అధికారులు గోప్యత పాటించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తొలి నోటిఫికేషన్‌లో ఏప్రిల్ 15న ప్రీబిడ్ మీటింగ్ ఉంటుందని పేర్కొన్నగా దీనిని 11వ తేదీకి మార్చారు. అయితే ఈ మార్పుపై పలువురు ఆసక్తి గల బిడ్డర్లకు సమాచారం అందలేదని తెలిసింది. ఇదిలా ఉంటే, 11వ తేదీన జరిగిన ప్రీబిడ్ మీటింగ్‌లో చేసిన సవరణలను వెంటనే బిడ్డర్లకు మరో నోటిఫికేషన్ ద్వారా తెలియజేయాలి. కానీ, 11న సమావేశం జరిగితే 23వ తేదీన సవరణలు చేసినట్టుగా పేపర్‌లో నోటిఫికేషన్ ఇచ్చి కొత్త డాక్యుమెంట్‌ను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. సమావేశం పూర్తయిన 12 రోజుల తర్వాత నిర్ణయాలు వెల్లడించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అన్ని రోజులు ఆగాల్సిన అవసరం ఏమిటి? ఎవరి కోసం ఆలస్యం చేశారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే కొందరు బిడ్డర్లకు అవకాశం ఇవ్వకుండా ఉండేందుకే ఆలస్యం చేశారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సవరణల నోటిఫికేషన్ 23న వెలువడితే.. 28వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఇచ్చారు. అంటే బిడ్డర్లకు మిగిలింది ఐదు రోజులే. ఇందులో ఆదివారం పోతే మిగిలింది నాలుగు రోజులే. ఇంత తక్కువ సమయంలో బిడ్డింగ్ ఎలా వేస్తారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

నిబంధనల్లోనూ తప్పులు... గందరగోళం

టెండర్ నోటిఫికేషన్ డాక్యుమెంట్‌ను తయారు చేయడంలో మార్క్‌ఫెడ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. గత సంవత్సరం ఇచ్చిన నోటిఫికేషన్‌ను కాపీ పేస్ట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎంతో ముఖ్యమైన నోటిఫికేషన్‌ను తప్పుల తడకగా రూపొందించడం విమర్శలకు తావిస్తున్నది. అధికారులు చెప్పిన దాని ప్రకారం.. బిడ్డింగ్ వేసేందుకు స్టోరేజీ, హ్యాండ్లింగ్, ట్రాన్స్‌పోర్టేషన్‌లో మూడేండ్ల అనుభవం ఉండాలి. లేదా హ్యాండ్లింగ్, ట్రాన్స్‌పోర్టేషన్‌లో ఐదేండ్ల అనుభవం లేదా స్టోరేజీలో ఐదేండ్ల అనుభవం ఉండాలి. కానీ, నిబంధనల్లోని పేరా 3.3.1లో ఉన్న అనుభవం సర్టిఫికెట్ కాలంలో మాత్రం స్టోరేజీ, హ్యాండ్లింగ్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్‌లో మూడేండ్ల అనుభవం తోపాటు హ్యాండ్లింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ లేదా స్టోరేజీలో ఐదేండ్ల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. ఇక్కడ రెండు వేరువేరు నిబంధనలను ఒకటిగా కలిపేసి పేర్కొనడం గమనార్హం. ఇది అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట. కొన్నిచోట్ల 'ఐదేండ్లకుపైగా' అనుభవం ఉండాలని పేర్కొన్న అధికారులు.. మరికొన్ని చోట్ల 'ఐదేండ్ల' అనుభవాన్ని మాత్రమే పేర్కొన్నారు. ఇలాంటి తప్పుల నేపథ్యంలో భవిష్యత్‌లో లీగల్ సమస్యలు ఏర్పడితే పరిస్థితి ఏమిటనే ప్రశ్న వినిపిస్తున్నది. ఇక మరో అంశం.. మొత్తం ఆరు లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం గల గోదాములను బిడ్డర్ అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. అయితే, నిబంధనల్లో బిడ్డింగ్ సమయానికి సగం సామర్థ్యం అంటే మూడు లక్షల టన్నుల సామర్థ్యాన్ని చూపించాలని, ఆ తర్వాత బిడ్డింగ్ దక్కితే నెల రోజుల్లో మిగిలిన మూడు లక్షల టన్నుల సామర్థ్యం చూపించాలని పేర్కొన్నారు. ఈ నిబంధన పూర్తి లోపభూయిష్టమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నెల రోజుల్లో 3 లక్షల టన్నుల సామర్థ్యం గల గోదాములను కల్పించడం సాధారణ విషయం కాదని, ఇందులో తెరవెనుక తతంగం నడుస్తున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎస్‌బీఐని కాదని ప్రైవేటు బ్యాంకుకు..

ప్రభుత్వ సంస్థలు తమ ఆర్థిక లావాదేవీలను ప్రభుత్వరంగ బ్యాంకుల్లో నిర్వహిస్తే ఎలాంటి సమస్య ఉండదు. కానీ, మార్క్‌ఫెడ్ మాత్రం ఇందుకు విరుద్ధంగా ప్రభుత్వ బ్యాంకు ఎస్‌బీఐని కాదని ప్రైవేటు బ్యాంకు కొటాక్ మహేంద్రకు పెద్దపీట వేసింది. ఇప్పటికే సంస్థకు చెందిన కోట్లాది రూపాయల డిపాజిట్లను కొటాక్‌లో పెట్టిన అధికారులు.. ఇప్పుడు ఎరువుల టెండర్‌లో ఈఎండీతో పాటు ఇతర లావాదేవీలకు కొటాక్ బ్యాంకు ఖాతాను నోటిఫికేషన్‌లో పేర్కొనడం గమనార్హం. ఈ టెండర్ల ద్వారా ఈఎండీ రూపంలోనే బ్యాంకు ఖాతాలో రూ.2.16 కోట్లు జమవుతాయి. అదే విధంగా టెండర్ పూర్తి తర్వాత సెక్యూరిటీ డిపాజిట్ రూపంలో మరో రూ.5.4 కోట్లు జమవుతాయి. ఈ విధంగా స్వల్ప కాలంలోనే బ్యాంకుకు కోట్లాది రూపాయల ట్రాన్సాక్షన్ జరుగుతుంది. ఈ నేపథ్యంలో మార్క్‌ఫెడ్ అధికారులు ఎస్‌బీఐని కాదని, ప్రైవేటు బ్యాంకును ఎందుకు ఎంచుకోవాల్సి వచ్చిందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. కొటాక్ మహేంద్ర బ్యాంకులో డిపాజిట్లపై గతంలోనే పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపించాయి. అయినప్పటికీ అధికారులు అదే బ్యాంకుతో అంటకాగడంపై మరోసారి ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ఐసీఏఆర్ మాజీ చీఫ్ అనుమానాస్పద మృతి

కావేరీ నదిలో కనిపించిన మృతదేహం

మండ్య: భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) మాజీ డైరెక్టర్ జనరల్ 'పద్మశ్రీ' సుబ్బన్న అయ్యప్పన్ (70) అనుమానాస్పద స్థితిలో మరణించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆయన మృతదేహం కావేరీ నదిలో శనివారం కనిపించింది. నది ఒడ్డున ఆయన బైక్‌ను గుర్తించారు. ఆయన నదిలోకి దూకి ఉంటారని అనుమానిస్తున్నారు. దర్యాప్తులో అసలు కారణాలు వెల్లడికావచ్చు. మైసూరులోని విశ్వేశ్వరనగర్‌లో నివసిస్తున్న సుబ్బన్న ఈ నెల 7 నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు విద్యారణ్యపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రాజ్యాంగమే అత్యున్నతం

- రిటైర్మెంట్ తర్వాత ఏ పదవులూ స్వీకరించను
- కాబోయే సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్

న్యూఢిల్లీ: భారతదేశంలో రాజ్యాంగమే అత్యున్నతమైనదని జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ చెప్పారు. ఆయన ఈ నెల 14న భారత ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్నారు. ఆయన ఆదివారం తన నివాసంలో విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పార్లమెంటు, న్యాయ వ్యవస్థ గురించి ఉప రాష్ట్రపతి, కొందరు రాజకీయ నేతలు చేసిన వ్యాఖ్యలను విలేకర్లు ప్రస్తావించినపుడు జస్టిస్ గవాయ్ స్పందిస్తూ, 'రాజ్యాంగమే అత్యున్నతమైనది. కేశవానంద భారతి కేసులో 13 మంది న్యాయమూర్తుల ధర్మాసనం ఇచ్చిన తీర్పులో ఈ విషయం చెప్పింది' అన్నారు. న్యాయమూర్తులు పదవీ విరమణ అనంతరం గవర్నర్ వంటి పదవులను పొందడం గురించి ప్రస్తావించినపుడు గవాయ్ మాట్లాడుతూ, 'నాకు రాజకీయ ఆకాంక్షలు లేవు. పదవీ విరమణ తర్వాత నేను ఏ పదవులూ స్వీకరించను' అని తెలిపారు. మాజీ సీజేఐకి గవర్నర్ పదవి ప్రొటోకాల్ ప్రకారం దిగువ స్థాయిలోనిదని చెప్పారు. న్యాయమూర్తులు ఇతరులను, రాజకీయ నేతలను కలుస్తుండటం గురించి మాట్లాడుతూ, ఓ న్యాయమూర్తిగా ఏకాకిలా బతకలేమని చెప్పారు. వివిధ రంగాల వ్యక్తులను కలవకపోతే, వారి సమస్యలను అర్థం చేసుకోలేమని తెలిపారు. తాను మణిపూర్‌లో పర్యటించినపుడు ఓ వృద్ధురాలు తన ఇంట్లోకి ఆహ్వానించారని, అప్పుడు మన దేశ ఐకమత్యం, స్నేహ సంబంధాల గురించి తెలుసుకోగలిగానని చెప్పారు. జస్టిస్ గవాయ్ మన దేశంలో సీజేఐ పదవిని చేపట్టే మొదటి బౌద్ధ మతస్థుడు కావడం విశేషం.

సీయూఈటీ సెంటర్ల కేటాయింపుపై విమర్శలు

న్యూఢిల్లీ : కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ ఫర్ అండర్‌గ్రాడ్యుయేట్స్ (సీయూఈటీ-యూజీ), 2025 పరీక్షా కేంద్రాల కేటాయింపుపై విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నది. ఢిల్లీ-ఎన్‌సీఆర్, మీరట్, పరిసర ప్రాంతాల విద్యార్థులకు దాదాపు 100 కి.మీ. దూరంలోని డెహ్రాడూన్, ముజఫర్‌నగర్ వంటి చోట్ల పరీక్షా కేంద్రాలను కేటాయించారు. మూడో ప్రాధాన్యం కింద ఎంచుకున్న పరీక్షా కేంద